ప్రజాశక్తి

ఆదివారం 29 సెప్టెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉక్కు పరిరక్షణకు ఉద్యమించండి

◆ విద్యార్థుల పోరాటాలతోనే నాడు స్టీల్‌ప్లాంట్ నిర్మాణం ◆ విద్యార్థి మేధో మథనం సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, వేదికపై బాల మోహన్‌దాస్, కొల్లా రాజమోహన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో 1966లో విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం జరిగిన పోరాటాల్లో ఆంధ్రా యూనివర్సిటీ, ఎవిఎన్ కాలేజీ విద్యార్థులే కీలకపాత్ర పోషించారని, నేడు స్టీల్‌ప్లాంట్‌ను ఎవడికో అమ్మేస్తాం, మూసేస్తాం అంటే విద్యార్థులు, యువకులు చూస్తూ ఊరుకోకూడదని, దాని పరిరక్షణకు ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని ఎయు టిఎల్ఎన్ సభా హాల్‌లో సేవ్ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ స్టూడెంట్ ఫోరమ్ ఆధ్వర్యాన విద్యార్థుల మేధో మథనం సదస్సు శనివారం జరిగింది. విశాఖ ఉక్కును పభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సొంత గనులు కేటాయించాలని 1325 రోజులుగా విశాఖలో ఉక్కు కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని ఈ సదస్సును ఆంధ్రా యూనివర్సిటీ టిఎల్ఎన్ సభా హాల్‌లో ఏర్పాటు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్, నాడు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్న నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడారు. విశాఖ ఉక్కు మిగతా 2లో..



సదస్సుకు హాజరైన విద్యార్థులు



టెట్ నిర్వహణా ఏర్పాట్లుపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

టెట్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

◆ 3 నుంచి 21 వరకూ పరీక్షల నిర్వహణ ◆ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనున్న టెట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఎపి టెట్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ 3 నుంచి 21వ తేదీ వరకూ టెట్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. జిల్లాలోని 7 కేంద్రాలతో పాటు అనకాపల్లి జిల్లాలోని ఒక కేంద్రం వెరసి 8 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ కేంద్రాలకు ప్రత్యేక అధికారులను, స్క్వాడ్ బృందాలను నియమించినట్లు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల మిగతా 2లో..

ఆదర్శనీయుడు.. సన్యాసిరావు

▶ వార్త 4లో..

టన్ను చెరుకుకు రూ.3,151 మద్దతు ధర

▶ వార్త 6లో..

అదరహో.. వైశాఖి నృత్యోత్సవ్

ఆకట్టుకున్న ఒడిసీ, జుగల్బందీ, కూచిపూడి, కథక్ ప్రదర్శనలు



నృత్యంలో అలరిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (ఎన్ఎండిఎ) వ్యవస్థాపక అధ్యక్షులు బిఆర్.విక్రమ్ కుమార్ (గౌడ్) ఆధ్వర్యాన కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న 'వైశాఖి నృత్యోత్సవ్' రెండో రోజైన శనివారం అదరహో అనేలా సాగింది. నృత్య ప్రదర్శనలు చూపరులను కట్టి పడేశాయి. రెండో రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎపిఎస్‌పి విశాఖ కమాండెంట్ కెవి.మురళీకృష్ణ, గౌరవ అతిథిగా సిఆర్‌పిఎఫ్ రెండో కమాండెంట్ పి.కిషోర్, ప్రియ అతిథిలుగా సూదగాని రవిశంకర్ నారాయణ్, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణమూర్తి హాజరయ్యారు. శనివారం ప్రదర్శనలో భాగంగా ఒడిశాకు చెందిన ప్రముఖ ఒడిసీ నాట్య నిపుణురాలు, 'పద్మశ్రీ' అవార్డు గ్రహీత ఇలియానా సితారిస్టి తన బృందంతో కలసి కనువిందైన ఒడిసీ నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం పశ్చిమ బెంగాల్‌కు చెందిన పరణిత, ఇంద్రనీల్ బృందాలు చక్కటి ప్రదర్శన ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గతానారాయణ్ చేసిన కూచిపూడి నాట్య ప్రదర్శన అలరించింది. జర్మనీకి చెందిన గురు దుర్గా ఆర్య బృందం కథక్ నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఈ ప్రతిష్టాత్మక నృత్యోత్సవాల సందర్భంగా ప్రదర్శనానంతరం ఆయా కళాకారుల స్థాయికి తగ్గట్టు అవార్డుల ప్రదానం చేశారు. అందులో భాగంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత ఇలియానా సితారిస్టికి డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్ అవార్డు-2024ను, కథక్ నృత్యకారిణి గురు దుర్గా ఆర్య (జర్మనీ)కు కథక్ వైశాఖీ జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. కూచిపూడి నర్తకి గీతానారాయణ్‌ను వైశాఖీశ్వర ఎక్స్‌లెన్స్ అవార్డుతో సత్కరించారు.

మొదటి పేజీ తరువాయి..

ఉక్కు పరిరక్షణకు ఉద్యమించండి

– ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని విశాఖ ఉక్కు – మన హక్కు నినాదంగా మార్చాలని కోరారు. ప్రయివేటు వ్యక్తులు బజ్జీలు, పకోడీలు, పండ్లు, నిత్యావసర సరుకుల దుకాణాలైన సూపర్ మార్కెట్‌లు నడిపినంత సులువుగా స్టీల్‌ప్లాంట్‌ను నడపడం సాధ్యం కాదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ భూముల కోసమే ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఉన్న హిందూస్థాన్ జింక్ పరిశ్రమను వేదాంత కంపెనీకి నాడు బిజెపి, టిడిపి ప్రభుత్వాలే కట్టబెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ పరిశ్రమను నాడు మూసివేసి అందులో పనిచేసిన పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులందరినీ రోడ్డున పడేసి, నేడు ఆ భూములు అమ్ముకుంటున్నారని తెలిపారు. లక్ష మందికి ఉపాధి కల్పించే స్టీల్‌ప్లాంట్ గాజువాకకే పరిమితం కాదని, ఆంధ్ర రాష్ట్రానికే ఏకైక భారీ పరిశ్రమ అని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ప్రజలు చేపట్టిన ఉద్యమాన్ని, 32 మంది ప్రాణాల త్యాగాన్ని, మత్స్యకారులు, రైతులు తమ భూములను ప్లాంట్ కోసం ఇచ్చిన వైనాన్ని విద్యార్థులకు వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటేనే ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోగలుగుతామని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. నేడు భారతదేశంలో నిరుద్యోగం అధికంగా పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు ప్రైవేట్ చేతుల్లోకి వెళితే మరింత నిరుద్యోగం పెరిగి భవిష్యత్ అగమ్యగోచరంగా తయారవుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్రలను తెలియజేశారు. ఉక్కు రక్షణ కోసం ఆంధ్రా యూనివర్శిటీలోనే ఉద్యమానికి పునాది వేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉక్కు రక్షణకు ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం పూర్వ నాయకులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో 60,574 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, ఈ నెల 22 నుంచి హాల్ టికెట్లు డౌన్లోడ్ అవుతున్నాయని వివరించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, తగిన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను కోరారు. పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్రశిక్ష ఎపిసి బి.శ్రీనివాసరావు, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రికి ప్రపంచస్థాయి పురస్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టి ట్యూట్‌కు ప్రపంచ స్థాయి పురస్కారం దక్కినట్టు యాజ మాన్యం తెలిపింది. శనివారం మేఘాలయ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించింది.



మాట్లాడుతున్న మురళీకృష్ణ

ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ వూన్నా మాట్లాడుతూ ప్రతి ఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ కేన్సర్ దినోత్సవం నిర్వహిస్తుంటారని, ఈ ఏడాది 'క్లోజ్ ది కేర్ గ్యాప్' నినాదంతో కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఈ క్రమంలో తమ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అనేక ప్రచార కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిందని పేర్కొన్నారు. కేన్సర్ పట్ల ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించిందని తెలిపారు. 'క్లోజ్ ది కేర్ గ్యాప్' ఇతివృత్తంతో నిర్వహించిన ఈ ప్రచారం లక్షలాది మంది ప్రజలకు చేరువైందన్నారు. అంతేగాక కేన్సర్ నివారణ, చికిత్స, మనుగడ అంశాలలో ప్రేరణకు తోడ్పడిందన్నారు. అందుకుగాను తమ ఆసుపత్రి ప్రపంచ వ్యాప్తంగా టాప్-3లో గుర్తింపు పొందిందని తెలిపారు. జెనీవాలో నిర్వహించిన ప్రపంచ కేన్సర్ సదస్సులో ప్రపంచ కేన్సర్ దినోత్సవ ప్రచారం - 2024 పురస్కారాల ఎంపికలో యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ కేన్సర్ కంట్రోల్ (యుఐసిసి), వరల్డ్ కేన్సర్ కాంగ్రెస్ - 24 జెనీవా వారిచే టాప్ 3లో గుర్తింపు పొందినందుకు తమకు సంతోషంగాను, గర్వంగానూ ఉందని వెల్లడించారు.

ఈ సదస్సులో కేన్సర్ ప్రభావ దినోత్సవ నివేదిక ప్రదర్శించడం జరిగిందన్నారు. తమకు లభించిన ఈ గౌరవం కేన్సర్ అవగాహనను పెంపొందించడంలో, ప్రపంచ స్థాయి కేన్సర్ చికిత్సను అందించడంలో తమ నిబద్ధతను రుజువు చేస్తుందన్నారు. ఆసియా నుండి ఇలాంటి గుర్తింపు పొందిన ఏకైక సంస్థగా, ఈ ప్రాంతంలో కేన్సర్‌పై పోరాటంలో చేయటంలో అగ్రగామిగా నిలిచినందుకు తమకు ఈ గౌరవం దక్కిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో రోబోటిక్ సర్జరీ పరికరాలను సమకూర్చుకున్న ప్రప్రథమ హాస్పిటల్‌గా, 400కుపైగా క్లిష్టమైన కేన్సర్ రోబోటిక్ సర్జరీలు, 200కు పైగా బోన్ మారో ట్రాన్స్ప్లాంట్ చికిత్సలను పూర్తి చేసినట్లు చెబుతూ సంతోషం వ్యక్తపరిచారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి బ్లడ్ డిజార్డర్స్ కోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా బినైన్, మాలిగ్నెంట్ హెమటాలజీ, సిఎఆర్ - టి సెల్ థెరపీ ట్రీట్‌మెంట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చి, రోగులందరికీ ఒకే చోట సమగ్ర సంరక్షణను అందిస్తామని చెప్పారు.

మళ్లీ మాటల గారడీయేనా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'మాటలు కోటలు దాటక ముందే కనీసం ఆచరణ గడప దాటుతుందా?' అంటే అంత కచ్చితంగా చెప్పే పరిస్థితులు కనుచూపుమేరలో కానరావడం లేదు. విజన్ - 2047 నాటికి ఎపిని దేశంలోనే నెంబర్ 1 స్థానంలో నిలబట్టే మాటలు. దేశంలోనే విశాఖను ఆర్థిక నగరంగా తీర్చిదిద్దడం వంటి మాటలు వినేందుకు బాగానే ఉన్నా... అమలు ఆవగింజంతైనా ఉంటుందా ? అన్నది పలువురి నుంచి వ్యక్తమవుతోన్న ధర్మ సందేహం. ఈ నెల 25న విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం - సిఐఐ సంయుక్త ఆధ్వర్యంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్ -2024 జరిగింది. రాష్ట్ర మానవ వనరులు, ఐటి వ్యవహారాల శాఖ మంత్రి నారా లోకేష్ ఈ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా హాజరై పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిపెట్టే వారికి దిశానిర్దేశం చేస్తూ ఎపి అభివృద్ధి, విశాఖ నగరాన్ని అందంగా తీర్చిదిద్దే అంశాలపై ప్రసంగించారు. అంతవరకూ బాగానే ఉన్నా 2016 నుంచి 2018 మధ్య కాలంలో మూడు దఫాలుగా టిడిపి అధికారంలో ఉండగా విశాఖ కేంద్రంగా సిఐఐ పారిశ్రామిక పెట్టుబడుల సదస్సులు జరిగాయి. రూ.లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయి. నాడు ప్రచారం బారెడు చేసి అమలు ఆవగింజంతైనా కాలేదన్నది సత్యం. 2016లో 368 ఎంఒయులు, 4.67లక్షల కోట్ల పెట్టుబడులు, 9.58 లక్షల ఉద్యోగాలు, 2017లో 665 ఎంఒయులు, రూ.10.54 లక్షల కోట్ల



పెట్టుబడులు, 22.54 లక్షల ఉద్యోగాలు, 2018లో 734 ఎంఒయులు, రూ.4.39 లక్షల కోట్ల పెట్టుబడులు, 11.02 లక్షల ఉద్యోగాలు కల్పించాలని చంద్రబాబు మూడు రోజుల సభా వేదికలుగా ప్రకటించారు. ఆచరణలో ఇది మాటల గారడీగానే మిగిలింది మినహా ఎపికిగానీ, విశాఖకుగానీ ఏ మాత్రం ఒరిగింది లేదు.

విశాఖకు ఏం కావాలి ?

వాస్తవం చెప్పాలంటే విశాఖలో అన్నీ ఉన్నాయి. ఆ ఉన్నవాటిని కాపాడుకోవాల్సిన పరిపాలన, రాజకీయాలు కావాలి. తూర్పు తీరంలో మూడో అతిపెద్ద నగరం విశాఖపట్నం. దేశంలోనే మొదటి నేవల్ బేస్ ఇక్కడే ఏర్పాటైన విషయం తెలిసిందే. పారిశ్రామిక రంగంలో వైజాగ్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచే 'విశాఖ ఉక్కు', పోర్టు, షిప్‌యార్డు, బిహెచ్‌పివి, హెచ్‌పిసిఎల్, డిసిఐ ఒకటేమిటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయం విశాఖ నగరం. వీటన్నిటికీ తోడు అందమైన ప్రదేశం. ప్రకృతి సిద్ధమైన కొండలు, ఆహ్లాదకర వాతావరణం విశాఖ సొంతం. గడచిన 10 ఏళ్లలో విశాఖకు వచ్చిందేమీ లేదు. మెట్రో రైలు, రైల్వే జోన్ ఊసే లేకుండా పోయింది. ఇక్కడ ఉన్న ఉక్కును 'తుక్కు' చేసి అమ్మేయాలన్న కేంద్ర బిజెపి నిర్ణయంతో కార్మిక అశాంతి మూడేళ్లుగా పెల్లుబుకుతున్నా కేంద్ర, రాష్ట్ర పాలకులకు పట్టడం లేదు. ఇంకా ఏం కొత్త కంపెనీలు తెస్తారు ? ఐటి పరిశ్రమలు ఎక్కడొస్తున్నాయి.. డేటా సెంటరు నిజంగా వచ్చే పరిస్థితి ఉందా ? అన్న ప్రశ్నలు నేడు అందరిలో ఉద్భవిస్తున్నాయి.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

సిఎం, డిప్యూటీ సిఎంలకు సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు లేఖ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్ ప్లాంట్ పరిస్థితి రోజురోజుకూ ప్రమాదకర పరిస్థితికి నెట్టబడుతోందని, ఉత్పత్తిని దారుణంగా దెబ్బతీస్తున్నారని, దీన్ని గుర్తించి, స్టీల్‌ప్లాంట్‌ను తక్షణం సెయిల్‌లో విలీనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు శనివారం లేఖలు రాశారు. ఆ వివరాలను ఆయన మీడియాకు వివరించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికులు, ఆఫీసర్లపై తీవ్ర దాడి ప్రారంభించిందన్నారు. శనివారం ఏకంగా 4200 మంది కాంట్రాక్టు కార్మికులను రాత్రికి రాత్రే చట్ట విరుద్ధంగా తొలగించేందుకు పూనుకుందన్నారు. 500 మంది ఆఫీసర్లు, కార్మికులను వివిధ కంపెనీలకు బదిలీలు చేస్తున్నారన్నారు. మరో 2500 మంది పర్మినెంట్ కార్మికులను ఏకంగా తొలగింపుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. అంతేగాక కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోగా, ఉద్యోగుల వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలకు ఏకపక్షంగా కోతపెట్టారన్నారు. ఇంటి అద్దె చెల్లింపు నిలిపివేశారన్నారు. క్వార్టర్స్‌లో నివాసం ఉన్న ఏడు వేల మందికిపైగా ఉద్యోగులకు విద్యుత్ ఛార్జీలను యూనిట్‌కు రూ.8కు పెంచారంటే ఏ స్థాయిలో దాడి జరుగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ కానివ్వబోమని, ఉత్పత్తి పెంపుదలకు అవసరమైన నిధులను కేటాయించేలా చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఓ వైపు ప్రకటిస్తున్నారని, ఆచరణలో స్టీల్ ప్లాంట్ పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందని తెలిపారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ నిరంకుశ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అడ్డుకోవాలన్నారు. ఇటీవల జివిఎంసి కౌన్సిల్ సమావేశం జరిగిందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను వెంటనే సెయిల్‌లో విలీనం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని గుర్తుచేశారు. అఖిలపక్ష రాజకీయ బృందం మేయర్ నాయకత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు కేంద్ర ఉక్కు శాఖ మంత్రిని, ప్రధాన మంత్రిని కలిసి అభ్యర్థించాలని కూడా తీర్మానించడమైందన్నారు. త్వరలో తమ బృందం మిమ్మల్ని కలవటానికి తగు తేదీ తెలియజేయాలని లేఖలో కోరారు.

ఆర్‌టిఒ సేవలను ప్రైవేటుపరం చేయొద్దని ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆర్‌టిఒ సేవలను ప్రైవేటుపరం చేయొద్దని డిమాండ్ చేస్తూ శనివారం ఆర్‌టిఒ కార్యాలయం ఎదుట విశాఖ మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌టిఒకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. అప్పలరాజు మాట్లాడుతూ ఆర్‌టిఒ ద్వారా లైసెన్సులు, బ్రేకు, ఫిట్నెస్ ఇతర అనేక సౌకర్యాలు వివిధ టెస్టులు చేసి అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇవన్నీ ప్రైవేటు వారికి ఇవ్వాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే వివిధ ఏజెన్సీల పేరుతో, బ్రోకర్ల పేరుతో అసలు ధర కంటే రెట్టింపు ఫీజులు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఇంకా ఈ సేవలు ప్రైవేటు వారికి అప్పగిస్తే పూర్తిగా ఆటోమోటార్ కార్మికుల్ని దోపిడీ చేయడం తప్ప మరొకటి కాదన్నారు. కార్యక్రమంలో విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి.రాజ్‌కుమార్, రాము, గౌరీసు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్లు

కొనసాగుతున్న టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం గీతం యూనివర్సిటీ వేదికగా ప్రారంభమైన ఎపి స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీలు రెండో రోజైన శనివారమూ విజయవంతంగా కొనసాగాయి. అతిథులుగా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రసాద్ దాస్, డాక్టర్ సార్వభౌమ, కె.శ్రీకృష్ణమూర్తి, విశాఖపట్నం టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు జెకె.నాయక్, కార్యదర్శి శర్మ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా...

2న ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబర్ 2న చేపట్టే భారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తి పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల నాయకులతో కలిసి శనివారం పౌరగ్రంథాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ప్రజా ఉద్యమ ర్యాలీకి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేయడానికి దూకుడు పెంచుతున్న సమయంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాలు ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల ప్రజా సంఘాలన్నీ కలిసి మహా ఉద్యమంలా డాబాగార్డెన్స్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తదుపరి కార్యక్రమం కోసం తీర్మానం చేసి లక్ష మందితో ర్యాలీ చేయడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును కాపాడడం కోసం ఉద్యమంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కేంద్రం, రాష్ట్రంలోని రాజకీయ నాయకుల మాటలన్నీ అవాస్తవాలని, పొంతన లేని మాటలతో కార్మికులను గందరగోళానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి పన్నుల చెల్లింపుల్లో ముందుండే పరిశ్రమ విశాఖ ఉక్కు అన్నారు. దానిని కావాలనే మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి, ప్రయివేటీకరణ చేయాలని కుట్ర పన్నుతోందని ఆరోపించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా చేపడుతున్న ర్యాలీని అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఐఎఫ్‌టియు నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను ఏ విధంగానైనా ప్రయివేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తోందని, దీన్ని అడ్డుకోవడానికి ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యాన చేపట్టే భారీ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సమావేశం అనంతరం ప్రజా సంఘాల నాయకులు సమావేశమై తదుపరి చేపట్టే ఉద్యమం, కార్యాచరణపై చర్చించారు. సమావేశంలో ఎం.లక్ష్మి (పిఒడబ్ల్యు), వై.నూకరాజు, జె.రవి (భారత నాస్తిక సమాజం), కెఎస్.చలం (న్యాయవాదుల సంఘం), కె.పద్మ (మహిళా చేతన), సూర్య ప్రకాష్, రవి (మురికివాడల సంఘం), సహృదయ సాహితీ ప్రధాన కార్యదర్శి చిన సూర్యనారాయణ, ఉప్పల లక్ష్మణరావు (అరసం), కార్మిక సంఘం నాయకులు డెంకాడ ఆనంద్, సిఎంఎస్ లలిత, సోడదాసి సుధాకర్, మేడా మస్తాన్ రెడ్డి, విశాఖ సిటిజన్ ఫోరం ప్రతినిధి పిఎస్.తిలక్, స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ సీనియర్ ఇంజినీర్ ఎస్ఎస్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని ఎన్జీ పాలెం పాల కేంద్రం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. కసింకోట ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... ఎలమంచిలి మండలం సైకిల్‌పాలెం గ్రామానికి చెందిన పెంటకోట సాయి (23) ద్విచక్ర వాహనంపై తాళ్లపాలెం నుండి ఎలమంచిలి వైపు వెళుతుండగా, ఎన్జీపాలెం వద్ద వెనుక నుండి లారీ ఢీకొట్టింది. దీంతో సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సాయికి తండ్రి మాణిక్యం, తల్లి పార్వతి, ఒక సోదరి ఉన్నారు. సాయి మృతదేహాన్ని కసింకోట పోలీసులు ఎన్టీఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మృతుడు తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఎస్సై మనోజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో రెండు వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శొంఠ్యాం సమీపంలో శనివారం సాయంత్రం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని యాత కనమాం గ్రామానికి చెందిన కోరాడ సురేష్ (24), గోరింట గ్రామానికి ఎర్రిబాబు (26) ఎదురెదురుగా బైక్‌లపై వస్తూ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సురేష్‌కు కాలు విరిగింది. ఎర్రిబాబుకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం విశాఖపట్నం క్యూ1 హాస్పిటల్, పినాకిల్ హాస్పిటల్‌కు తరలించారు.

ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ ఆర్‌టిఒ కార్యాలయం ఎదురుగా టైల్స్‌షాప్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వస్తున్న వ్యక్తిని బైకు ఢీకొట్టింది. టైల్స్ షాప్‌లో పనిచేస్తున్న మద్దిలపాలెం చైతన్యనగరకు చెందిన బుస కృష్ణ (38) నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణతోపాటు బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్మగ్లర్ అరెస్టు

ప్రజాశక్తి -నక్కపల్లి:గంజాయి స్మగ్లర్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. రోలుగుంట మండలం బీబీ పట్నం గ్రామానికి చెందిన గంజాయి స్మగ్లర్ ఆది రాజులనాయుడు 2023లో గంజాయి అక్రమ రవాణా కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అప్పటి నుంచి స్మగ్లర్ ఆది రాజుల నాయుడు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. శనివారం స్మగ్లర్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

ఎంవిపి కాలనీ : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.ధనంజయనాయుడు ఆధ్వర్యాన ఆర్‌పిఎఫ్/ఎల్ఎస్ఐ పిఆర్.బికోయి సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారంపై తనిఖీలు చేపట్టారు. అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రం, భిండ్ జిల్లాకు చెందిన అమన్ సఖ్య, రాధే శ్యామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 11.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని ఆర్‌పిఎఫ్ సిబ్బంది శాంతారామ్‌కు అప్పగించారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు పంపారు. విశాఖపట్నం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు సూచనలు మేరకు విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, సింహాచలం రైల్వే స్టేషన్ల పరిధిలో తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మాధవధార : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఈ నెల 30వ తేదీన చేపట్టే మహాధర్నాకు సంబంధించి 49, 50, 51 వార్డుల్లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్.శ్రావణ్‌కుమార మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం రూ.28,728 ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 30వ తేదీ తర్వాత మున్సిపల్ కార్మికులందరూ మరో సమ్మె చేయడం తథ్యమని హెచ్చరించారు. 30వ తేదీ ధర్నాలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంగారయ్య, ధనలక్ష్మి, రమణ, శంకర, శివ, భద్ర, దేవి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్ పునఃప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.12.85 లక్షలతో టి.నగరపాలెం గోస్తనీ పక్కన పుష్కర ఘాట్ మరమ్మతు పనులు చేపట్టి శనివారం పునఃప్రారంభించారు. పంచాయతీ ప్రజల విజ్ఞప్తి మేరకు గతంలో ఇదే ప్రాంతంలో పుష్కర ఘాట్‌ను నిర్మించిన విషయం విదితమే. మరమ్మతులు చోటు చేసుకోవడంతో మెట్ల మార్గం, రెయిలింగ్, ప్రహరీ మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పొట్నూరు చంద్రశేఖర్, పి.రాము, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎఐ ద్వారా ట్రాఫిక్ ఫైన్స్

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖ నగరంలో త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ట్రాఫిక్ చలానాలు విధించే పద్ధతిని అమల్లోకి తీసుకొస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత భాగ్చీ చెప్పారు. మధురవాడలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సిగ్నల్ పాయింట్ వద్ద కొత్త సాంకేతిక పద్ధతి ద్వారా ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. నిబంధనలు పాటించకుండా ఎవరైనా ప్రయాణిస్తే ఎఐ పరిజ్ఞానం ద్వారా కెమెరాలు నెంబర్ ప్లేట్‌ను గుర్తిస్తాయని వివరించారు. తద్వారా ఈ చలానాలు విధిస్తామన్నారు. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించామని, త్వరలో ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు.

చెకుముకిలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- భీమునిపట్నం : చెకుముకి పోటీల్లో స్థానిక జివిఎంసి ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు నిహాల్, సృజన, రేవతి ప్రతిభ కనబరిచి మండల స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఇ.వెంకట్రావు శనివారం తెలిపారు.

సంతను మార్చొద్దంటూ వర్తకుల ఆందోళన



శనివారం సంత వద్ద చిల్లర వర్తకుల ఆందోళన

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ప్రతి శనివారమూ నిర్వహిస్తున్న సంతను కొమ్మాది కూడలి వద్ద పెట్టుకోవాలని వర్తకులపై నిర్బంధం ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సంత వర్తకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ, కొమ్మాది కూడలి నుంచి గ్రామీణ ప్రాంతం వరకు ఉన్న బృహత్తర ప్రణాళిక రహదారిపై భారీ వాహనాలు తిరిగే ప్రాంతంలో సంతను ఏర్పాటుచేస్తే ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. ధర్నాకు ముందు మూడు సార్లు జోనల్ కమిషనర్ సింహాచలం, ట్రాఫిక్ సిఐ కాంతారావు, శాంతి భద్రతల విభాగం ఎస్ఐ సురేష్, ట్రాఫిక్ ఎస్ఐలు, టిడిపి నాయకులు ఎం.లక్ష్మణ, వి.అప్పలరాజు చర్చలు జరిపారు. చర్చలు ఫలించక పోవడంతో ధర్నాకు దిగారు. జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సాయంకాలం యథావిధిగా సంతను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు, జి.కిరణ్, ఐఎఫ్‌టియు నాయకులు ఎం.లక్ష్మి, అరుణ, సంత సంఘం నాయకులు టి.అప్పారావు, వెంకటరమణ, బి.రమణ, శంకరరావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం


నోటీసు అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆరిలోవ : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై అక్టోబరు 2న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేయనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్ అంబేద్కర్ తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. దీక్షకు సంబంధించిన నోటీసును జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ పర్యవేక్షణాధికారి సుందర్ సింగ్‌కు యుటిఎఫ్ నాయకులు శనివారం అందజేశారు. నోటీసు అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, తాటికొండ జగన్ ఉన్నారు.

మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మండల విద్యాశాఖ అధికారి గంగరాజు ఆధ్వర్యాన నిర్వహించారు. మండలంలో అన్ని పాఠశాలల నుంచి ఎంపికైన 36 మందికి ఈ పోటీలు నిర్వహించారు. వ్యాసరచనకు 32 మంది, వక్తృత్వ పోటీలకు నలుగురు హాజరయ్యారు. వీరిలో కెజిబివి విద్యార్థి ఎస్.డి.లేశ్వరి వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానం, ఆనందపురం జడ్‌పి హైస్కూల్ విద్యార్థి డి.లీలా వర్ధన్ ద్వితీయ స్థానం, కెజిబివి విద్యార్థి ఎల్ జోష్న తృతీయస్థానంలో నిలిచారు.

వక్తృత్వ పోటీలలో కెజిబివి విద్యార్థిని బి.లేఖ్య ప్రథమ స్థానంలో, తర్లువాడ జడ్‌పి హైస్కూల్ విద్యార్థిని పి.తేజస్విని ద్వితీయ స్థానంలో, బోయపాలెం జడ్‌పి హైస్కూల్ విద్యార్థిని టి.ప్రవళిక తృతీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణపట్నాయక్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలో ఇప్పటికే అమలవుతున్నా కేంద్ర ప్రభుత్వ పథకాలైన గ్రామీణ ఉపాధి హామీ పథకం, గృహనిర్మాణ పథకాల అమలు తీరుపై రెండో రోజు శనివారం మండలంలోని మూలకుద్దు గ్రామ పంచాయతీలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు పరిశీలించారు. ఆయా పథకాల లబ్ధిదారులతో బృందం సభ్యులు సమావేశమై పథకాలు అమలు ఎలా ఉంది, ఏ మేరకు లబ్ధిపొందుతున్నారో తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతో ఎండిఒ ఎన్.హనుమంతరావు, ఇఒపిఆర్‌డి జి.అప్పలరాజు పాల్గొన్నారు.

వ్రిందా ఆసుపత్రి వద్ద మృతుని బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా వ్యక్తి మృతి చెందాడని ఆయన బంధువులు శనివారం వ్రిందా ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. విజయనగరం జిల్లా జామి మండలం, కొత్త భీమసింగి గ్రామానికి చెందిన అల్లి నర్సినాయుడు (42) కేన్సర్‌తో ఈ నెల 19న ఆరిలోవ హెల్త్‌సిటీలోని వ్రిందా ఆసుపత్రిలో చేరారు. ఈ నెల 21న నర్సినాయుడుకు సర్జరీ చేశారు. ఆయన పరిస్థితి క్షీణించి ఈ నెల 27న మృతి చెందాడు. దీనిపై వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని మృతుని బంధువులు ఆందోళన చేపట్టారు. ఆరిలోవ ఇన్‌చార్జ్ సిఐ ఎల్.మురళీ, ఎస్ఐ కృష్ణ అక్కడకు చేరుకొని విషయం అడిగి తెలుసుకున్నారు. మృతుని బంధువులు ఆసుపత్రి యాజమాన్యంతో సంప్రదింపులు చేసుకొని మృతదేహాన్ని తీసుకెళ్లిపోయారు.



ప్రారంభిస్తున్న డిటిసి రాజారత్నం

ప్రమాదాల నివారణకు కృషి : డిటిసి

ప్రజాశక్తి -గాజువాక : ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రమాద రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జీసీ రాజారత్నం అన్నారు. పాత గాజువాక సిఎంఆర్ సెంట్రల్ వద్ద శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన టూ వీలర్ లోన్ అండ్ ఎక్సేంజ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి భద్రత చాలా ముఖ్యమన్నారు. నమ్మకమైన సంస్థల ద్వారానే రుణాలు తీసుకోవాలని సూచించారు. శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ అన్ని కంపెనీల వాహనాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి మేళా ఏర్పాటు చేయడం శుభపరిణామం అని పేర్కొన్నారు. పారిశ్రామికంగా ఎంతగానో అభివృద్ధి చెందుతున్న గాజువాకలో ఇటువంటి మేళాలు ప్రజలకు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో విశాఖ, గాజువాక ప్రాంతీయ రవాణా శాఖ అధికారులు వి.జయప్రకాష్, శ్రీనివాస్, ఫైనాన్స్ సంస్థ ఎపి కోస్టల్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ఇ.నాగేంద్ర, కిరణ్, వాసు, రమణరాజు, జగదీష్, సూరిబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాహనాలు కొనుగోలు చేసిన వారికి డిటిసి తాళాలను అందజేశారు.

విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న కాశీవిశ్వనాథ్

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌కు 2024 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్షిక పర్యాటక ఉత్తమ అవార్డులు కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ప్రతిబింధుక పర్యాటక ప్రాజెక్ట్ అవార్డు లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ అధినేత కాశీ విశ్వనాథ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ, పర్యాటక రంగంలో అత్యున్నత అవార్డు తమ క్లబ్‌కు రావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. రానున్న కాలంలో మరింతగా అభివృద్ధి చేసి విశాఖ ప్రజలకే కాకుండా ఉత్తరాంధ్ర ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా కృషి చేస్తానని చెప్పారు.

ఆటో డ్రైవర్లకు వరద నష్టపరిహారం రూ.50 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వం విజయవాడ ఆటో డ్రైవర్లకు వరద నష్టపరిహారం కింద రూ.50 వేలు ఇవ్వాలని ఏపీ ఆటో డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. విజయవాడ వరద బాధిత ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేలు రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, రవాణా, పోలీస్ అధికారులు ఆటోలపై పెడుతున్న అక్రమ కేసులు, వేలాది రూపాయలు జరిమానాలను ఆపాలని డిమాండ్ చేస్తూ ద్వారకానగర్ జంక్షన్ బుద్ధుని పార్క్ రోడ్డులో ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ, ఎన్నికల ముందు చంద్రబాబు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఆటో స్టాండ్ కార్మికులు యు.శివాజీ, కె.దేముడు, రావికృష్ణ, ఈశ్వర్, శ్రీను, భాస్కర్, సతీష్, నాగరాజు, రవి, బుజ్జి, నర్సింగ్ పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

ప్రజాశక్తి -ములగాడ : ప్రపంచ రేబిస్ డే సందర్భంగా జివిఎంసి 40వ వార్డులోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు శనివారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కల యజమానులకు అవగాహన కల్పించారు. స్థానిక కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రేబిస్ వ్యాధి ప్రాణాంతకారమైనదని, ఈ వ్యాధి నివారణ టీకా వేయించడమే మార్గమని చెప్పారు. పెంపుడు కుక్కలకు ఏటా క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ, రేబిస్ వ్యాధి టీకాలు ఫ్రీగా ఆస్పత్రిలో వేస్తున్నట్లు తెలిపారు. శనివారం 45 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేసినట్లు చెప్పారు.

ఆదర్శనీయుడు.. సన్యాసిరావు

- కలం, గళంతో సమాజాన్ని మేల్కొలిపిన గొప్ప వ్యక్తి
- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - గాజువాక : తన కలం, గళంతో సమాజాన్ని మేల్కొలిపిన గొప్ప వ్యక్తి ప్రజానాట్య మండలి సీనియర్ కళాకారులు, రచయిత జి.సన్యాసిరావు అని పలువురు వక్తలు కొనియాడారు. గాజువాక లయన్స్ క్లబ్‌లో సన్యాసిరావు సంస్మరణ సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ప్రజా గాయకునిగా, రచయితగా సన్యాసిరావు జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఆయన కడ వరకూ ఉద్యమంతో మమేకమై ఉన్నారని తెలిపారు. అచ్యుతాపురంలో ప్రజలు భూములు కోల్పోయినప్పుడు, రైతులు, నిర్వాసితులు సమస్యలపైనా తాను అప్పట్లో పోరాటాలు చేయగా పది రోజులపాటు తనతో వీధి వీధినా తిరిగి పాటలతో అందరిలో చైతన్యం నింపారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అచ్యుతాపురం సెజ్‌లో యూనియన్ పెట్టగలిగేమంటే ఆ రోజు సన్యాసిరావు ఆ పోరాటంలో పాటలు పాడడమే కారణమన్నారు. పాటలే ఊపిరిగా బతికారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ సన్యాసిరావు ధన్యజీవి అన్నారు. ప్రతి ఉద్యమంలోనూ ఆయన పాట ఉందన్నారు. ప్రభుత్వాలు కార్మికులపై దాడులకు దిగినప్పుడు సన్యాసిరావు తన కలం, గళంతో కార్మిక ఉద్యమాలకు ఉత్తేజాన్ని ఇచ్చారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ సన్యాసిరావు ఆత్మస్థైర్యం ఉన్న వ్యక్తి అని తెలిపారు. ఉద్యమ ధ్యాస తప్ప ఆయనకు మరో ఆలోచన లేదన్నారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ ఏదైనా లక్ష్యాన్ని సాధించాలంటే.. తపన, పట్టుదల ఉంటే చాలు.. అంగవైకల్యం అడ్డు రాదని నిరూపించిన గొప్ప వ్యక్తి సన్యాసిరావు అన్నారు. సమ సమాజ స్థాపన లక్ష్యం కోసం నిరంతరం పనిచేశారని తెలిపారు. ఆయనకు కుటుంబం నుంచి ఎనలేని సహకారం అందిందని తెలిపారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు మంగరాజు మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేయడంలో సన్యాసిరావు పాత్ర గొప్పదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ అత్యున్నత కళాకారుడు సన్యాసిరావు అని. ఆయన బుర్ర పాదరసం వంటిదని అన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, సిఐటియు జిల్లా నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు టి.శ్రీరామమూర్తి, ఎంసిపిఐ నాయకులు పట్నాయక్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జి.రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సన్యాసిరావు కుమారులు స్టాలిన్, సత్య సుందరయ్య తదితరులు పాల్గొన్నారు. ముందుగా సన్యాసిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. సన్యాసిరావుపై ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను నాయకులు ఆవిష్కరించారు. సన్యాసిరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు 600 మొక్కలను పంపిణీ చేశారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం, చిత్రంలో సిహెచ్.నర్సింగరావు, కృష్ణమూర్తి, జగ్గునాయుడు, అజశర్మ తదితరులు

స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వ వైఖరి మారకుంటే తీవ్ర పరిణామాలు



దీక్షలో కూర్చున్న కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వ, యాజమాన్యాల వైఖరి మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ హెచ్చరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 1325వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు, కార్మికులు కూర్చున్నారు. దీక్షనుద్దేశించి అయోధ్యరామ్ మాట్లాడుతూ, ఒక పక్క ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతూనే ప్రయివేటీకరణను వెనక్కు తీసుకోలేదని కేంద్రమంత్రి చెప్పడాన్ని తీవ్రంగా విమర్శించారు. యాజమాన్యం, ప్రభుత్వ ఆదేశాలతో ప్లాంట్‌లో మానవ వనరులను తగ్గిస్తూ చర్యలు చేపట్టిందన్నారు. దీనిలో పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకులను అందించకుండా, కార్మికులను దోషులుగా చిత్రీకరించే కేంద్ర ప్రభుత్వ విధానాలను ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

యూనియన్ ఉపాధ్యక్షులు కె.గంగాధర్ మాట్లాడుతూ, సెయిల్‌లో అధికారులు, కార్మికులు 54 వేల మంది ఉన్నారని, ఉత్పత్తి 20 మిలియన్ టన్నులు చేస్తున్నారని తెలిపారు. అంటే ఒక మిలియన్ టన్నుకు 2750 ఉన్నారని పేర్కొన్నారు. అదే పద్ధతిలో విశాఖ ఉక్కు కర్మాగారంలో 12,292 మంది 7.3 మిలియన్ టన్నుల స్టీల్ ఎలా ఉత్పత్తి చేస్తారని ప్రశ్నించారు. యాజమాన్యం తప్పుడు లెక్కలతో కార్మికులపై చేస్తున్న దాడిని తక్షణం విరమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు ఎన్ రామారావు, పుల్లారావు, మరిడయ్య, వి.ప్రసాద్, పట్టా రమేష్, మొహిద్దీన్, అప్పలరాజు, దేముడునాయుడు, కె.బాలశౌరి, డిఎస్‌విఎస్.శ్రీనివాస్, కెఆర్‌కె రాజు, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైసిపి పూజలు

ప్రజాశక్తి-యంత్రాంగం

తిరుమల పవిత్రతకు చంద్రబాబు భంగం కలిగించారని, ఆయన పాపాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల వైసిపి ఆధ్వర్యాన ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

విశాఖ జిల్లాలో 56వ వార్డు కంచరపాలెం ప్రాంతంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం, పంజాబ్ హోటల్ జంక్షన్ శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో జియ్యాని శ్రీధర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుషికొండలో ఉన్న వెంకటేశ్వర ఆలయంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు పూజలు నిర్వహించారు. ఆరిలోవలోనివెంకటేశ్వర స్వామి మందిరంలోనూ మేయర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. జివిఎంసి 49వ వార్డు పరిధిలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి నాయకులు పూజలు చేశారు. పద్మనాభంలోని కుంతీ మాధవ్ స్వామి ఆలయాన్ని ఎంపిపి కె.రాంబాబు ఆధ్వర్యాన వైసిపి నాయకులు నీటితో కడిగి పవిత్రత చేశారు.

ఆనందపురం మండల వైసిపి అధ్యక్షులు బంక సత్యం ఆధ్వర్యాన గంభీరంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రావికమతం మండలం కొత్తకోట, టి.అర్జా పురం గ్రామాలలోని ఆలయాల్లో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, నాయకులు ప్రత్యేక పూజలు చేసారు. చంద్రబాబు ఆరోపణలు అవాస్తవమని మాజీ ఎమ్మెల్యే గణేష్ విమర్శించారు. నర్సీపట్నంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో గణేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వందరోజుల పరిపాలన పై ప్రజలకు సమాధానం చెప్పలేక లడ్డు అంశాన్ని తెరపైకి తీసుకు వచ్చిందని మాజీ మంత్రి బూడి ముత్యాల నాయుడు ఆరోపించారు. మాడుగులలో పలు దేవాలయాల సందర్శించి పూజలు నిర్వహించారు.

వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి గాంధీనగర్-2వ వీధిలో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

షీలానగర్ స్థలం కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి -గాజువాక : షీలానగర్ స్థలం కబ్జాపై స్థానిక కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డికి స్థానికులు శనివారం ఫిర్యాదు చేశారు. షీలానగర్ కాలనీలో 43 సంవత్సరాల క్రితం బిహెచ్‌పివి ఉద్యోగులు 33 ఎకరాల స్థలం కొనుగోలు చేశారని, దానిని డెవలప్ చేసి 328 వ్యక్తిగతంగా స్థలాలు ఏర్పాటుచేసుకున్నామని వివరించారు. కాలనీ అవసరాల నిమిత్తం స్కూల్ గ్రౌండ్, హాస్పిటల్, గ్రంథాలయం, సామాజిక భవనం, వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం కొంత స్థలం కేటాయించామని తెలిపారు. వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని కొంతమంది వ్యక్తులు కబ్జాకు పాల్పడుతున్నారని, దీనిని ఆపాలని కోరారు. స్థానికులు తరపున, ఐద్వా నాయకులు వై.సత్యవతి, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గణబాబును కలిసిన తెలుగునాడు విద్యుత్ కార్మికులు

ప్రజాశక్తి-వేపగుంట : పశ్చిమ ఎమ్మెల్యే గణబాబును తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకులు బిఎమ్.నాయుడు, జోన్-3 డివిజనల్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో యూనియన్ స్థితిగతులపై చర్చించారు. తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కార్యవర్గ సభ్యులు ఐ.మధుసూదనరావు, సుందరపు మహేష్, రీజనల్ కోశాధికారి కిలాని సురేష్, జోన్ -3 కార్యదర్శి పి.భవానీప్రసాద్‌రాజు, వివిఎస్ఎస్‌డి.ప్రసాద్, కుసుమంచి రామకృష్ణ, గవర వెంకటరావు, నాయుడుబాబు, బి.గంగాధర్, భీమరశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆహార పొట్లాలు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన శనివారం స్థానికంగా ఉన్న 25 మంది వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు మధ్యాహ్న భోజన పొట్లాలు అందజేశారు. నిత్య సేవలో భాగంగా సమితి జోన్ కో-ఆర్డినేటర్ ఎం సత్యసాయి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో ఉక్కు రక్షణకు పోరాటాలు



విశాఖలో నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు కుమార్ తదితరులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్

భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం పోరాడదామని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. శనివారం భగత్ సింగ్ జయంతి కార్యక్రమాన్ని జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి సంఘం ఉపాధ్యక్షులు వై.రాజు, పి.వెంకటరెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబర్ 1, 2, 3 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన, కార్మిక, మహిళ, రైతు సంఘాలతో నిరాహార దీక్షలు జరుగుతున్నాయన్నారు. వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అచ్యుతాపురం : స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా మండలంలోని కొత్తూరు గ్రామంలో శనివారం భగత్ సింగ్ విగ్రహానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని రాము పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు, శెట్టి మహాలక్ష్మి నాయుడు, అమ్మూరి తిరుపతిరావు, కిల్లాడి సచిన్, నల్లమారి మేస్త్రి వెంకటరావు, దమ్ము చండి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రంలో భగత్ సింగ్ చిత్ర పటానికి డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నాగమంత్రి నారాయణరావు, మాజీ నాయకులు జి.దేవుడు నాయుడు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ అతి చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడని భగత్ సింగ్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ధోని కాసియా, సిహెచ్ గంగరాజు, సిహెచ్ అప్పలరాజు, పి శ్రీను, చిన్న, నాగేష్, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి 15వ వార్డు హెచ్‌బి కాలనీ బస్‌స్టాప్ వద్ద ఎఐవైఎఫ్ ఆధ్వర్యాన భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.మధు రెడ్డి, నాయకులు రావి అశోక్, బాలు, హరీష్, తేజ, రాజు, శ్రీను పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.వి. ఎస్. ఎస్. శాస్త్రి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్ త్యాగనిరతిని కొనియాడారు. కళాశాల అధ్యాపకులు రాజు, రామ్ కుమార్ మాట్లాడుతూ, భగత్ సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని దేశం అభ్యున్నతికోసం యువత నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో భగత్ సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అండర్-19 చెస్, క్యారమ్స్, తంగట మార్షల్ ఆర్ట్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ ఎన్. రామకృష్ణ, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.శ్రీలక్ష్మి తెలిపారు. కబడ్డీ, వాలీబాల్ ఎంపిక పోటీలు చోడవరం జూనియర్ కళాశాలలో ఈ నెల 30న జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పిడి ఎల్.సుధాకర్, సిఎల్ఎన్ ప్రసాద్, సూర్యనారాయణ, వివిధ కళాశాలల పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

30న రైఫిల్ షూటింగ్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి -పరవాడ : అండర్ 14, 17 బాల బాలికల రైఫిల్ షూటింగ్ ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఎంపిక పోటీలు మండలంలోని పి.బోనంగిలో ఉన్న సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లాల ఎస్‌జిఎఫ్ కార్యదర్శులు వి.దేవుడు, ఎంవి నాగేశ్వరరావు, కొండలరావు, అండర్ 19 కార్యదర్శి ఎస్. శ్రీలక్ష్మి తెలిపారు. అలాగే వుషు (శాండా) అండర్ 14, అండర్ 17, అండర్ 19 బాలబాలికల ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఎంపిక అక్కడ జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఎలిజిబుల్టీ ఫార్మ్, ఆధార్ కార్డు, పుట్టిన ధ్రువపత్రంతో ఈ నెల 30 సోమవారం ఉదయం 9 గంటలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్లో హాజరు కావాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కేసులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం జంక్షన్‌లో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి పెనాల్టీ విధించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పోలీసులకు సూచించారు. అచ్యుతాపురం నుంచి వెదురువాడ గ్రామపంచాయతీ వరకు శనివారం ఆయన నడుచుకుంటూ పరిసరాల పరిశుభ్రత ట్రాఫిక్ నిబంధనలు తదితర వాటిని పరిశీలించారు. అచ్యుతాపురం, ఎలమంచిలి, అనకాపల్లి, పూడిమడక, గాజువాక రహదారులపై వాహనాలు క్రమబద్ధీకరణ లేక రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. అధ్వానంగా ఉన్న రహదారులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా చేయడంలో శ్రద్ధ వహించాలని గ్రామ సర్పంచ్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

అనకాపల్లిలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రథమ మహాసభ నేపథ్యంలో శనివారం వందలాదిమంది విద్యార్థులతో పట్టణ పురవీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియం ఎదురుగా జరిగిన బహిరంగ సభలో జాన్సన్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వాల విధానాలతో ప్రభుత్వ విద్య కనుమరుగయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికే వైద్యవిద్య ప్రైవేట్‌పరం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని, ఆ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ మరింతగా పోరాటం చేయాలన్నారు. భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.బాబ్జి అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శులు షేక్ మస్తాన్, నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్, నాయకులు జగదీష్, సతీష్, శ్రీను, తాతాజీ, మాజీ నాయకులు ఆర్ దొరబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు జాన్సన్ బాబు

ఎన్‌టిపిసి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ధర్నా



ధర్నా చేస్తున్న ఎన్‌టిపిసి కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-పరవాడ

ఎన్టిపిసి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆ సంస్థ మెయిన్ గేట్ వద్ద ఎన్టిపిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టిపిసి కాంటాక్ట్ కార్మికులకు ఎన్టిపిసి లోగోతో కూడిన ఐడి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ మారిన కార్మికుల తొలగింపులు, వేధింపులు చేయరాదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కొంతమంది కాంట్రాక్టర్లు జీతాలు బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్టీపీసీ యాజమాన్యం కాంటాక్ట్ కార్మికులతో అధిక పనులు చేయించుకొని డబల్ ఓటి ఇవ్వకుండా సింగిల్ ఓటి మాత్రమే ఇస్తుందని తెలిపారు. చట్ట ప్రకారం ఇవ్వవలసిన పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, సెలవులు, గ్రాడ్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గోవిందరాజ్, నాయుడు, రామారావు, తదితరులు పాల్గొన్నారు

బేవరేజెస్ కార్మికులకు కూలి రేట్లు పెంచాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ గోడౌన్ వద్ద లోడింగ్ అన్ లోడింగ్ హమాలీలకు కూలి రేట్లు పెంచాలని యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొండలరావు డిమాండ్ చేశారు. హమాలీల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ అక్టోబర్ 1 నుండి నూతన మద్యం పాలసీ రాష్ట్ర ప్రభుత్వం పెడుతుందని, ఎగుమతి కూలి రేట్లు ఒప్పందం పూర్తయి రెండు సంవత్సరాల కావస్తుందని, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా దిగుమతి ఎగుమతి కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. బాక్స్ ఒక్కింటికి తొమ్మిది రూపాయలు చొప్పున చెల్లించాలని, రాబోయే లైసెన్స్ దారులు చెల్లింపుకి చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు సంవత్సరాలుగా బాక్స్ ఎగుమతి, దిగుమతి కూలి రేట్లు పెంచకపోవడం వలన కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమం బేవరేజ్ హమాలీ యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, కొండాజీ, కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బేవరేజెస్ హమాలీలు

వైద్య కాంట్రాక్టు కార్మికుల సమ్మె వాయిదా

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి, ఏరియా, సామాజిక ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, సూపర్ వైజర్ కార్మికుల సమస్యలపై ఈ నెల 30 నుంచి జరగాల్సిన సమ్మె అక్టోబర్‌కు సమ్మె వాయిదా వేసినట్లు ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడోట ప్రకాష్ ఆధ్వర్యంలో శనివారం డిసిహెచ్ శ్రీనివాస్ కార్యాలయంలో చర్చలు జరిగాయని, అక్టోబర్ నెల 5వ తేదీ వరకు సమయం కావాలని వారు కోరగా తాము అంగీకారం తెలిపినట్లు చెప్పారు. అప్పటి వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

30న ధర్నాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -అనకాపల్లి

ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీ వేజ్, కంటింజెంట్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 30న జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకరరావు, ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కార్మికులు తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, ఉద్యోగ భద్రత లేదని, సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పినా, నేటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. మున్సిపాలిటీ, ఆర్టీసీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వైద్య ఆరోగ్యశాఖ, విద్య శాఖ, పరిశ్రమల్లో పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నారని, ఉద్యోగ భద్రత లేకుండా ఉందని పేర్కొన్నారు.

బౌద్ధ సంఘాలను పిలవకపోవడం విచారకరం

ప్రజాశక్తి- అనకాపల్లి : బొజ్జన్న కొండపై లేజర్ లైటింగ్ సౌండ్ సిస్టం తదితర అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి బౌద్ధ సంఘాలను పిలవకపోవడం విచారకరమని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా బౌద్ధ సంఘాలు, ప్రజా సంఘాల నిరసన కార్యక్రమాల నేపథ్యంలో ప్రభుత్వం రూ.7.50 కోట్లతో ఈ అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

ఉత్తమ రైతులకు సన్మానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తిమ్మరాజుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఆవరణలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఉత్తమ రైతులను ప్రజా ప్రతినిధుల చేతులమీదుగా సన్మానించారు. సంఘ అధ్యక్షులు ఎం.నీలకంఠేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ రైతులుగా ఎంపికైన ఎల్లపు దొరప్పలనాయుడు, కాండ్రేగుల రమణ, పి.జగ్గా సోమానాయుడులకు సాలువా కప్పి జ్ఞాపకను అందజేశారు. సంఘంలో తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు కాండ్రేగుల అప్పారావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, శరగడం శివబాబు నాయుడు, బుద్ద రంగారావు, సీతఈ ఆర్.విశ్వేశ్వరరావు, హరిపాలెం తిమ్మరాజుపేట అందలాపల్లి గ్రామాలకు చెందిన సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కెజిబివిల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -అనకాపల్లి : కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఒప్పంద ప్రాతిపదికన బోధన, ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన బోధనేతర మహిళా సిబ్బందిని ఏడాది కాలానికి తీసుకొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిటి 7, సిఆర్‌టి 8, పార్ట్ టైం టీచర్స్ 7, వార్డెన్ 4, అకౌంటెంట్లు మూడు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. వీటికి మహిళా అభ్యర్థులు రూ.250 చెల్లించి ఆన్లైన్లో ద్వారా apkgbv.apcfss.in అడ్రస్‌కు అక్టోబర్ 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆఫ్లైన్ దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. ఓపెన్ క్యాటగిరీలకు 18 నుంచి 42 సంవత్సరాలు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ ఐదు సంవత్సరాలు, మాజీ సైనికులకు మూడు సంవత్సరాలు, వికలాంగులకు 10 సంవత్సరాలు వయోపరిమితి సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలో సబ్జెక్టుల్లో వారీగా రోస్టర్ వారీగా పోస్టుల వివరాలు apkgbv.apcfss.in వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవాలన్నారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రపంచ రేబిస్ డే సందర్భంగా హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిధిలో శనివారం వైద్యాధికారి డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రాబిస్ వ్యాధి లక్షణాలు ముందు జాగ్రత్తలు తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్, వైద్య సిబ్బంది శాంతి, గణేష్, నాగేశ్వరరావు, ముకేశ్, రమణ, వర్థిని పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం కళ్యాణ మండపంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషక ఆహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులకు పౌష్టిక ఆహారం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు బుద్ధిరెడ్డి చిన్న, గొంతిన శ్రీను, గల్లా రాజు, కర్రి సత్య నారాయణ, పావడ కామరాజు, కాయల మురళి, నైనముశెట్టి రమణరావు, ఉల్లింగల రమేష్, కర్రి గోవింద, సర్పంచ్ రెల్లి నాగయమ్మ, డాక్టర్ యు.రమేష్, సిడిపిఓ ప్రభావతి, సూపర్‌వైజర్ సుచరిత పాల్గొన్నారు.

గౌరీ పిఎసిఎస్ మహాజన సభ

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక శ్రీగౌరీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ముందుగా సంఘం వ్యవస్థాపకులు కీర్తిశేషులు వివి రమణ చిత్రపటానికి ఘనంగా నివాళ లర్పించారు. అనంతరం సొసైటీ పర్సన్ ఇన్చార్జ్ డి ఏ వి రామారావు మాట్లాడుతూ 2023 -24 ఆర్థిక సంవత్సరానికి గాను మెంబర్లకు ఏడున్నర శాతం డెవిడెండు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు విల్లూరు రాము, కెవి సూర్యనారాయణ, విల్లూరి శివసూరి, కొణతల రామ సూర్యనారాయణ,సంస్థ కార్యదర్శి, ప్రసాదు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ బి సీతామాలక్ష్మి ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. కళాశాల ప్లానింగ్, అభివృద్ధి కమిటీ సభ్యులు కోటాన రాము, గవర శ్రీనివాసరావు, డాక్టర్ గుల్లేపల్లి వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమని, ఉన్నతమైన ఆశయాలతో విద్యార్థులు చదువుకోవాలని సూచించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-దేవరపల్లి : మండలంలోని మారేపల్లి కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధి కార్యక్రమాల కోసం మాజీ ఎంపిపి, జడ్పిటిసిలు పోతల పాత్రునాయుడు, అచ్చియ్యమ్మ దంపతులు రూ.50 వేలు విరాళంగా ఆలయ ధర్మకర్త అవుగడ్డ రామమూర్తినాయుడుకి శనివారం అందజేశారు. వారిని రామ్మూర్తి నాయుడు, మాజీ సర్పంచ్ కోటిపల్లి నాయుడు, మారేపల్లి గ్రామస్తులు అభినందించారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయతీ పరిధి కృపాసహకార కేంద్రంలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయ్ కుమార్ ప్రతినెల నిర్వహిస్తున్న హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా 30 మంది నిరుపేదలు, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు శనివారం నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో పాస్టర్ శ్యామ్ బాబు, మణమ్మ, బ్రదర్ ఇస్సాకు, మ్యాత్యు, స్టెల్లి, రమ్య పాల్గొన్నారు.

టన్ను చెరుకుకు రూ.3,151 మద్దతు ధర

మహాజన సభలో కలెక్టర్ విజయ కృష్ణన్



మహాజన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-చోడవరం

2024-25 సీజన్‌కు చెరుకు మద్దతు ధర టన్నుకు రూ.3151 చెల్లించనున్నట్లు చోడవరం సుగర్ ఫ్యాక్టరీ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. ఫ్యాక్టరీ ప్రాంగణంలో శనివారం మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడచిన సీజన్‌కు రైతులకు, కార్మికులకు ఇవ్వవలసిన బకాయిల గురించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఫ్యాక్టరీకి గ్రాంట్ రూపంలో నిధులు వచ్చాయని, తమ ప్రభుత్వంలోనూ అంతకంటే ఎక్కువ నిధులు తీసుకొస్తామని చెప్పారు. మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం కూడా నిధులు తీసుకువచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ గతంలో అప్పుల్లో ఉన్న ఫ్యాక్టరీకి సుమారు రూ.90 కోట్లు గ్రాంట్ తీసుకొచ్చామన్నారు. ఈ ఏడాది కనీసం మద్దతు ధర రూ.3600కు తగ్గకుండా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ టన్నుకు రూ.3500 ఇవ్వాలని తాము చేసిన డిమాండ్‌కు కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, ఆర్డీవో చిన్నికృష్ణ, సిడిసి చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు, ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ బి.సన్యాసి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ అవినీతిపై విచారణ చేయాలని రైతుల డిమాండ్

ఫ్యాక్టరీలో గతంలో జరిగిన అవినీతిపై సమగ్రమైన విచారణ జరిపి దోషులను శిక్షించాలని మహాజన సభలో రైతులు రైతులు భీశెట్టి సింహాచలం, సిరిగిరిశెట్టి వెంకయ్య దొర, బూరె బాబురావు, తనకల మహేష్, గుడారు సూర్యనారాయణ, కర్రి నాగేశ్వరరావు తదితరులు డిమాండ్ చేశారు. ఈ అవినీతిపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో యథావిధిగా అవినీతి కొనసాగుతుందని, దానిని అరికట్టకపోతే ఫ్యాక్టరీ మనుగడ కష్టమవుతుందని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

మహాజన సభకు మక్కువ చూపని రైతులు

చోడవరం (గోవాడ) సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో శనివారం జరిగిన ఫ్యాక్టరీ మహాజన సభకు రైతులు అంతగా మక్కువ చూపలేదు. ఒకప్పుడు మహాజనసభ అంటే సుమారు పదివేల మంది సభ్య రైతులు హాజరయ్యేవారు. ప్రాంగణమంతా ఎటు చూసినా రైతులతో కోలాహలంగా ఉండేది. ఫ్యాక్టరీ ఆర్థిక లావాదేవీలు తెలుసుకోవడానికి పెద్ద సంఖ్యలో వచ్చేవారు. క్రమేపి ఫ్యాక్టరీ నష్టాల్లో కూరుకుపోవడం, చెరకు గిట్టుబాటు కాకపోవడం, సరఫరా చేసిన చెరకుకు సకాలంలో పేమెంట్లు ఇవ్వకపోవడం, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడం వెరసి చెరకు సాగు వైపు రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో గతంలో ఏడాదికి 5,50,000 టన్నుల చెరకు క్రషింగ్ జరిపే ఈ ఫ్యాక్టరీ ఇప్పుడు 1,50,000 టన్నులకు పడిపోయింది. అలాగే ఈ ఏడాది చెల్లించవలసిన టన్నుకు రూ.425 బకాయి ఇప్పటివరకు ఇవ్వలేదు. దీంతో ఫ్యాక్టరీపై రైతులకు ఆశలు సన్నగిల్లడంతో మహాజనసభ అంటే రైతులు పెద్దగా పట్టించుకోవడం మానేశారు. భవిష్యత్తులో టన్నుకు రూ.4000 ఇస్తే తప్ప చెరకు సాగు వైపు వెళ్లే అవకాశం లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు.



పూర్తిస్థాయిలో రైతులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

పార్టీలకతీతంగా యలమంచిలి అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ప్రజాశక్తి - యలమంచిలి

పార్టీలకతీతంగా యలమంచిలి అభివృద్ధికి కృషి చేద్దామని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోదెపు గోవింద్ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అచ్యుతాపురం, రాంబిల్లి, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాలు అనేక పరిశ్రమలతో అనూహ్యంగా అభివృద్ధిబాటలో పయనిస్తున్నాయని, యలమంచిలి మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యలమంచిలి అభివృద్ధికి జాతీయ రహదారి, రైల్వే కనెక్టివిటీ వరాలుగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే యలమంచిలి నివాస యోగ్య పట్టణంగా మారుతుందని చెప్పారు. గత నాలుగేళ్లలో జరిగినట్లుగా ప్రజాప్రతినిధుల అడ్డదారి ఆగడాలు ఇక సాగవని, అనర్హత లబ్ధిదారులకు లబ్ధి చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని, అధికార్లకు నచ్చచెప్పి పనులు చేయించుకోవాలని సూచించారు. మండలంలో పలు సమస్యలపై సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాజాన శేషగిరిరావు, ఎంపిడిఓ కొండలరావు, సర్పంచ్‌లు ఇత్తిశెట్టి నాయుడు, మహలక్ష్మి, వ్యవసాయ శాఖ ఏఓ మోహనరావు, ఇరిగేషన్, పోలీస్, పంచాయతీరాజ్, ఎలక్ట్రిసిటీ, హార్టికల్చర్, రెవెన్యూ అధికార్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనకాపల్లి కలెక్టరేట్లోని సమావేశహాల్లో శనివారం జిల్లాస్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. బ్లాక్ స్పాట్లలో లైటింగ్, బోర్డ్, సిగ్నల్ లాంటివి ఎక్కడైనా చేయవలసిన అవసరముంటే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ప్రమాదాలు జరిగే చోట ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలుపుతూ సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారులపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేషనల్ హైవే, ట్రాన్స్‌పోర్ట్స్, ఆర్ అండ్ బి అధికారులతో కలిసి లంకెలపాలెం, నక్కపల్లి జంక్షన్లను జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి మనోహర్, ఆర్‌డిఎ పిడి సచీదేవి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్, పోలీస్ డిపార్ట్మెంట్, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి చెందలేదు

ప్రజాశక్తి- అనకాపల్లి : విద్యుదాఘాతంతో గేదె మృతి శీర్షికన ఈనెల 27న ప్రజాశక్తి ప్రచురించిన వార్తకు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శనివారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. తుమ్మపాల సెక్షన్ పరిధిలోని ఈనెల 27న బవులవాడ గ్రామానికి చెందిన బాలవు నాగసూరి అప్పారావు విద్యుదాఘాతంతో గేదె మతి చెందినట్లు వచ్చిన వార్తకు తమ సిబ్బందితో తనిఖీ చేయించి పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించగా అక్కడ ఉన్న ఎర్త్ పైపు, ఎర్త్ ఫ్లాట్ ద్వారా ఎటువంటి విద్యుత్తు సరఫరా జరగలేదని, గేదె శరీరంపై ఎటువంటి విద్యుత్ షాక్‌కు సంబంధించిన గాయాలు లేవని తేలిందని, దీంతో గేదె విద్యుత్తు షాక్ తో మృతి చెంద లేనట్లు తమ పరిశీలనలో తేలినట్లు తెలిపారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో అనకాపల్లిలో జరుగు నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ ఆర్.శంకర్రావు, కో-కన్వీనర్ ఆర్.దొరబాబు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడానికి కంకణం కట్టుకొని ఉందని, ఇప్పుడు కాంట్రాక్ట్ వర్కర్లు కూడా తొలగిస్తున్నట్లు ప్రకటించిందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ ప్రభుత్వ రంగ పరిశ్రమ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వకుండా, వర్కింగ్ క్యాపిటల్ లేకుండా దాని ఊపిరిని కేంద్ర ప్రభుత్వం తీస్తుందని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ జరుగు ఈ కార్యక్రమంలో అన్ని సంఘాలు, రంగాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

36 మందికి కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పెదగుమ్మం సచివాలయం -3 ఆరోగ్య ఉప కేంద్రం వద్ద అగనంపూడి హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ బృందం క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు శనివారం నిర్వహించారు. రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, నోటి క్యాన్సర్లకు సంబంధించి 36 మందికి వైద్యులు నమిత, హరిప్రియ స్క్రీనింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కసింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యశోద, ఎంఎల్‌హెచ్‌పి దుర్గా, ఏఎన్ఎం నిర్మల, ఆశాలు, క్యాన్సర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన తహశీల్దారుకు అభినందనలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల తహశీల్దారుగా విధుల్లో చేరిన ఎం.లక్ష్మికి టిడిపి మండల నాయకులు శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో కలిసి సాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. రెవెన్యూ సమస్యలు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ తమరాన దాసు, సర్పంచ్ సుంకర లక్ష్మీ, కోట సత్యనారాయణ, మల్లెడ్డి బుజ్జి, వేపాడ మధు పాల్గొన్నారు.

పర్యావరణంపై విద్యార్థులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థులు దృష్టి సారించాలని స్పందించే హృదయం సంస్థ గౌరవాధ్యక్షులు కాండ్రేగుల వెంకటరమణ పిలుపునిచ్చారు. హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం 20 మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీపాద రవి, ఎవిఎస్.మూర్తి, సూరిశెట్టి శ్రీనివాస్, ఉమామహేష్ పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరిస్తాం

- కలెక్టర్ విజయకృష్ణన్- పలుచోట్ల మన ఇల్లు - మన గౌరరం

ప్రజాశక్తి-అనకాపల్లి:గృహ లబ్ధిదారుల సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. అనకాపల్లి మండలం మారేడుపూడి లేఅవుట్‌లో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. లబ్ధిదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నీరు, వీధిలైట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ మోటారు పనిచేయకపోవడం వలన నీరు అందడం లేదన్నారు. ఈ కారణాల రీత్యా తాము ఇల్లు కట్టుకోలేకపోతున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులకు సమస్యలను ఒక వారంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని వెన్నెల పాలెం గ్రామంలో హౌసింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు.సర్పంచ్ వెన్నెల అప్పారావు, గ్రామ ఉపసర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మోహన్‌రావు కాలనీ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు మాట్లాడారు. హౌసింగ్ డిఈ ఫణి, తహశీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి:పెండింగ్ లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని అధికారులు, నాయకులు లబ్ధిదారులకు సూచించారు నక్కపల్లి లో ఎంపీపీ రత్నం, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామరాజు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, హౌసింగ్ అధికారులు మన ఇల్లు మన గౌరవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులతో మాట్లాడారు . ఉపమాకలో జగనన్న కాలనీ జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, టిడిపి నాయకులు కొప్పిశెట్టి బుజ్జి ,జగదీశ్వరరావు , శ్రీను, ఆర్‌ఐ కన్నబాబు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సందర్శించారు.

భీమునిపట్నం : మండలంలోని అమనాం, జివిఎంసి నాల్గో వార్డు పరిధి కె.నగరపాలెం, చేపలుప్పాడ, కాపులుప్పాడ, జెవి.అగ్రహారం, నిడిగట్టు గ్రామాల్లో 'మన ఇల్లు - మన గౌరవం' కార్యక్రమాలు నిర్వహించారు. ఎండిఒ ఎన్.హనుమంతరావు , హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.హుస్సేన్ పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో మన ఇల్లు- మన గౌరవంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సునీత, ఎంపిడిఒ విజయకుమార్ పర్యవేక్షణలో సదస్సులు నిర్వహించారు. లబ్ధిదారులు 2025 మార్చి 31లోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని, లేకుంటే కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తుందని రెడ్డిపల్లి, తునివలస సభల్లో లబ్ధిదారులకు వివరించారు.



రామచంద్రపాలెంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మొక్కుబడిగా..

ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం మన ఇల్లు మన గౌరవం పేరిట ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని అధికారులు మొక్కుబడి తంతుగానే నిర్వహించారు. మండల వ్యాప్తంగా శనివారం ఈ కార్యక్రమం అధికారులు నిర్వహించారు. రామచంద్రపాలెం గ్రామంలో సచివాలయ కార్యదర్శి మినహా ప్రత్యేక అధికారి హాజరు కాలేదు. కొన్ని గ్రామాల్లో మొక్కుబడి పంపిగానే లేఅవుట్‌ల వద్ద ఫోటోలు తీసుకొని వెనుతిరిగారు. మండల కేంద్రం కోటవురట్ల గ్రామంలో తహసిల్దారు తిరుమల బాబు, ప్రత్యేక అధికారి ఉదయశ్రీ కోటవురట్ల లేఅవుట్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయశ్రీ మాట్లాడుతూ 19 సచివాలయాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను, కోటవురట్ల సర్పంచ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన సిపిఎం నేత, లబ్ధిదారులు

ప్రజాశక్తి-కె.కోటపాడు:ఇసుక లేనిది ఇళ్ల నిర్మాణం ఎలా చేయాలని మండల ప్రత్యేకాధికారిని మండలంలోని కొరువాడ హౌసింగ్ లబ్ధిదారులు, సిపిఎం జిల్లా నాయకులు కె.గోవిందరావు నిలదీశారు. కొరువాడ జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో లబ్ధిదారులతో శనివారం మండల ప్రత్యేకాధికారి ఈ నాగలక్ష్మి ఆధ్వర్యాన అధికారులు మన ఇల్లు- మన గౌరవం నిర్వహించారు. ఈ లేఅవుట్‌లో 27 ఇళ్లు పునాదుల వరకు వచ్చాయని, మరో రెండు ఇల్లు ఎటువంటి పనులు ప్రారంభించలేదని, వాటిని 2025 మార్చి 31వ తేదీ లోగా పూర్తి చేయాలని, లేకుంటే వారికి ప్రభుత్వం ఎటువంటి సహాయం అందని అధికారులు చెప్పడంతో లబ్ధిదారులు, సిపిఎం నేత భగ్గుమన్నారు. కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందజేస్తామని చెప్పి వంద రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఇవ్వకుండా ఇళ్ల నిర్మాణం ఎలా చేయాలని ప్రశ్నించారు. అగనంపూడి ఇసుక రీచ్ నుంచి ఇక్కడకు ఇసుక తెచ్చుకోవాలంటే రూ.10వేలు ఖర్చవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌కు తెలియజేసి లబ్ధిదారులకు ఇసుక సరఫరాకు ప్రయత్నం చేస్తామని ప్రత్యేకాధికారి హామీ ఇచ్చారు. సిపిఎం నేత గోవిందరావు మాట్లాడుతూ పట్టాలు ఇచ్చిన 3 ఇంటి స్థలాలపై విద్యుత్ వైర్లు ఉన్నాయని, వాటిని తొలగిస్తే కానీ నిర్మాణ చేయడం సాధ్యం కాదని, దీనిపై అనేక పర్యాయాలు అధికారులకు తెలియజేసినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ తహశీల్దారు రమేష్‌బాబు, హౌసింగ్ ఎఇ, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ప్రశ్నిస్తున్న సిపిఎం నేత గోవింద్

ప్రశస్త యాప్‌లో వివరాలు నమోదు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:విద్యార్థులందరినీ పరిశీలన చేసి దివ్యాంగుల వివరాలను ప్రశస్త యాప్ లో నమోదు చేయాలని ఎంఈఓ 2 వేమగిరి నూకరాజు సూచించారు. మండలంలోని దేవవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన ప్రశస్త యాప్ లో నమోదైన వివరాలను పరిశీలించారు. అన్ని పాఠశాలలోనూ ఉపాధ్యాయులు విద్యార్థులను పరిశీలించి దివ్యాంగుల విద్యార్థులను గుర్తించి, వారి అంగవైకల్యాలను ఏ విధంగా నమోదు చేశారో ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ వివరించారు.



పరిశీలిస్తున్న నూకరాజు

పంచాయతీలకు నేరుగా నిధులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: కూటమి పాలనలో రాష్ట్రంలోని అన్ని పంచాయతీలకు నిధుల సమస్య తీరిందని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర ఘుసూర్యచంద్ర అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో జనసేన పార్టీ అధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, పంచాయతీల్లోనూ ఉపాధి హామీ పనులకు తీర్మానాలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వంద రోజుల్లోనే మంచి పేరు వచ్చిందన్నారు. నాయకులు గణేష్, నాయకులు వెలగల వెంకటరమణ, గండెం దొరబాబు, మోపాడ చిరంజీవి, రేగుబళ్ల సాంబమూర్తి, బైన మురళీ పాల్గొన్నారు.

30న మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-గొలుగొండ:జన విజ్ఞాన వేదిక ఆద్వర్యంలో ఈ నెల 30న మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం హైస్కూల్‌లో మూఢ నమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తుల రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పోలీస్ శాఖ, ఎస్ఎఫ్ఐ నాయకులు కూడా హాజరవుతారని చెప్పారు.



వంటలను పరిశీలిస్తున్న డిప్యూటీవో అప్పారావు

పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీలో ప్రభుత్వ జిల్లా పరిషణ్ ఉన్నత పాఠశాల (ముస్లిం బడి) ని శనివారం ఉదయం డిప్యూటీ డిఇఓ అప్పారావు సందర్శించారు. విద్యార్థుల పురోగతిని పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మధ్యాహ్నం భోజనం నాణ్యత పాటించాలని, వంటశాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ, బాగా విద్యను అభ్యసించి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి వెళ్లాలని తెలిపారు. అప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.



మైదానంలో మంచు దుప్పటి


ప్రజాశక్తి -కోటవురట్ల:తొందరపడి ఒక కోయిల ముందే కూసింది, అని సినీ గేయ రచయిత రాసినట్లు వర్షాకాలం ముగియకముందే చలికాలం స్వాగతం పలికి మంచు సోయగంతో శనివారం దర్శనమిచ్చింది. దీంతో పకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుతం కురుస్తున్న మంచు కారణంగా మరికొద్ది రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల: కోటవురట్ల సబ్ రిజిస్టర్‌గా బి వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కె.కోటపాడు మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన నరసింహమూర్తి నక్కపల్లి బదిలీపై వెళ్లారు. కోటవురట్ల మాకవరపాలెం మండలాలకు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా డాక్టర్ పెట్ల నరేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాడుగుల మండలం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన సింహాద్రప్పుడు బదిలీపై విశాఖకు వెళ్లారు. ఈ సందర్భంగా సిబ్బంది వీరికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్‌డిఒ రమణ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : నూతన రెవెన్యూ డివిజన్ అధికారిగా శనివారం వివి రమణ బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండ ఆర్డిఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై నర్సీపట్నం వచ్చారు. ఆయన గతంలో నర్సీపట్నం తహశీల్దార్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో వివి రమణ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యత ఇస్తూ రెవిన్యూ సమస్యల పరిష్కారం దిశగా పని చేస్తానని వెల్లడించారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ రమణ



వానపాములను విడుదల చేస్తున్న ఎంపిడిఒ

చెత్త రహిత గ్రామాలే లక్ష్యం

ప్రజాశక్తి -నక్కపల్లి:చెత్త రహిత గ్రామాలుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా చెత్త సంపద తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నామని ఎంపీడీవో డి.సీతారామరాజు అన్నారు. మండలంలోని ఉద్దండపురంలో శనివారం చెత్త సంపద తయారీ కేంద్రంలో స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా వర్మీ కంపోస్టు తయారీకి సర్పంచ్ వెంకటేశ్వరరావుతో కలిసి వానపాములను విడుదల చేశారు.గ్రామాల్లో తడి ,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలించి సంపదను సృష్టించుకోవాలన్నారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి సత్యనారాయణ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:పర్యావరణం పరిరక్షణే ధ్యేయంగా వాసవి క్లబ్ పని చేస్తుందని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సి ఎస్ కుమార్ తెలిపారు. పర్యావరణం పరిరక్షణకై ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ఆదేశాల మేరకు విత్తనాలు చల్లి మొక్కలు పెంచే క్రమంలో సీడ్ బాల్స్ మట్టితో విత్తనాల బంతులు తయారు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇందులో భాగంగానే శనివారం స్థానిక వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్లిం బడిలో విద్యార్థులచే 25 వేల విత్తన బంతులను మట్టితో తయారు చేశామన్నారు. జెడ్‌సి రమేష్, ఆర్సి పరమేష్, వనిత వందనం ఇన్చార్జి అరుణ పాల్గొన్నారు.



కొత్తకోటలో సీడ్ బాల్స్ విత్తనాలు ఇస్తున్న సభ్యులు

.కొత్తకోట:ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కొత్తకోట వాసవి క్లబ్ న్యూ ప్రతినిధులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా శనివారం కొత్తకోట పియస్‌ఆర్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వాసవి క్లబ్ సభ్యులు వివిధ రకాల మొక్కలకు సంబంధించిన సీడ్ బాల్స్ విత్తనాలు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ న్యూ సభ్యులు పెంటపాటి ఆశోక్, రమేష్, నరేంద్ర, రామారావు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సివిల్ జడ్జి

వసతి గృహాలను తనిఖీ చేసిన సివిల్ జడ్జి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మండలంలో బీసీ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖ, సోషల్ వెల్ఫేర్, జీ టి డబ్ల్యూ వసతి గృహాలను మండల లీగల్ కమిటీ సర్వీసెస్ చైర్మన్, సివిల్ జడ్జి శ్యామ్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వసతి గృహాల్లో రికార్డులను పరిశీలించారు. మౌలిక వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ ఆథారిటీ ఆదేశాల మేరకు వసతి గృహాలలో విద్యార్థులకు సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించామని శ్యామ్ కుమార్ తెలిపారు. ఎస్సై రమేష్, ఎంఈఓ నాగేంద్ర, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆచార్యులు

ఘనంగా గుర్రం జాషువా జయంతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా హెచ్.ఎమ్.చోడిశెట్టి సత్యనారాయణ జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్యంలో జాషువా చేసిన కృషిని వివరించారు. జాషువా సామాజిక దృక్పధంతో రచనలు చేశారన్నారు. తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు మాట్లాడుతూ, సమాజంలో మూఢాచారాలపై తన రచనల ద్వారా నిరసించి ప్రజా చైతన్యం కలిగించిన గొప్ప దార్శనిక కవి జాషువా అని అన్నారు. తెలుగు సాహితీలోకంలో ఆయనొక దిగ్గజ కవి అని, ఆయనకున్న అపారమైన జ్ఞానంతో చేసిన రచనలు నేడు సామాజిక జీవనంలో అందరికీ ఆదర్శనీయంగా నిలిచాయన్నారు. ఆయన రాసిన గబ్బిలం ప్రజల్లో విశేషాదరణ పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.ఫల్గుణరావు, కుమారి, చిన్నారావు, శ్రీదేవి, రమేష్ బాబు పాల్గొన్నారు


గెలుపొందిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో నియోజకవర్గం స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీలను జిల్లా డిప్యూటీ డిఈ వో అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధ చూపాలన్నారు. పీడీ లక్ష్మణరావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో వివిద పాఠశాలల నుంచి అండర్ 14,17 బాలుర విభాగంలో వాలీబాల్ కబ్బడి, ఖోఖో, షటిల్ తదితర పోటీలకు 350మంది క్రీడాకారులు పాల్గొన్నారని, వీరిలో ప్రతిభ కనబర్చిన 120 మందిని జిల్లా స్థాయికి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్.ఎం. మల్లికార్జున రావు, నియోజకవర్గం స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ కన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా రాటోత్సవం

ప్రజాశక్తి-చీడికాడ: దేవీ నవరాత్రుల ఉత్సవ సందర్భంగా మండల కేంద్రంలో దుర్గాదేవి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాటను వేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, దేవి నవరాత్రుల పండగను చీడికాడలో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగభూషణం, నాగరాజు, పెంటారావు, ఈశ్వరరావు, ప్రతాప్ పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం లోడగలవానిపాలెంలో శనివారం దేవి శరన్నవరాత్రుల రాట మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ లోడగల రమణ, రాజేశ్వరి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లోడగల వెంకటరావు, నాగరాజు, లోడగల అప్పలనాయుడు పాల్గొన్నారు.

యలమంచిలి : దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా యలమంచిలి రామనగర్‌లో రాటపాతే ఉత్సవం శనివారం నిర్వహించారు. మాజీ ఎంపిటిసి లంక రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు జయమ్మ, నూకరత్నం, రామలక్ష్మి, పద్మ, బివికె,లక్ష్మి, హైమావతి, కవిత, కుమారి, లాలం లక్ష్మి, మీను, పావని, రాజేశ్వరి పాల్గొన్నారు.

లడ్డు కల్తీ వివాదంలో.. విచారణపై సిఎంకు భయమెందుకు ?

-ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: తిరుపతి లడ్డు కల్తి వివాదం లో ఉన్నత స్థాయి విచారణకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు భయపడుతున్నారని వైసిపి ఎంఎల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు.. శనివారం మధ్యాహ్నం లా సన్స్ బే కాలనీ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బొత్స మాట్లాడుతూ, లడ్డు వివాదంపై థర్డ్ పార్టీ విచారణ జరిపించాలని చంద్రబాబు ఎందుకు లేఖ రాయ లేదని ప్రశ్నించారు. చంద్రబాబు చేసింది తప్పు కావడతో హైకోర్టు, సుప్రీం కోర్టు, సీబీఐకి విచారణ జరిపించాలని లేఖ రాయలేకపోతున్నారన్నారు. స్టీల్ ప్లాంట్ లో 4 వేల మంది కార్మికులను తొలగిస్తే దానికి సమాధానం చెప్పే వారు లేరని , ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్ కోసం ఏమి చెప్పారు? ఇప్పుడు ఏమి చేస్తున్నారన్నారు.నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రజలకు కొనే పరిస్థితి లేదన్నారు. కూటమి అధికారం లోకి వచ్చిన తర్వాత 25 వేల కోట్లు అప్పు చేసిందన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారో సమాధానం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వర స్వామి ప్రసాదంతో రాజకీయం చేయడం ధర్మనేనా అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, మాజీ శాసన సభ్యులు చింతలపూడి వెంకటరామయ్య, పార్టీ నాయకులు ముగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

-ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి చైర్మన్ దయామణి


మాట్లాడుతున్న దయామణి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులందరికీ మినిమం టైం స్కేల్(ఎంటిఎస్) హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని ఎపి ఎన్ హెచ్ ఎం ఎపి జెఎసి చైర్మన్ దయామణి డిమాండ్ చేశారు. విశాఖపట్నం జిల్లా నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా సమావేశం శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, న్యాయమైన హక్కుల సాధన కోసం ఉద్యోగులందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఎపి ఎన్ హెచ్‌ఎం జెఎసి జిల్లా చైర్మన్ శశిభూషణ్ అధ్యక్షత వహించారు. జెఎసి రాష్ట్ర కోశాధికారి జె.సింహాచలం మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఆర్థికశాఖ కాంక్రెన్స్ అనుమతితో ఉత్తర్వులు (జిఓ) ఇచ్చి అమలు చేయకుండా ఉద్యోగులను దశలు వారీగా మోసం చేస్తూ శ్రమ దోపిడీకి పాల్పడిందని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులందరికీ ఒకే కేడర్ - ఒకే వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శశిభూషణ్, సురేష్, బ్రహ్మం, గోపినాధ్ ,నాగరాజు, మధు, మోహన్, పలు రంగాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


బహుమతులు ఇస్తున్న హెచ్‌ఎం, నాయకులు

ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యాన

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. శనివారం స్థానిక బాలికల ప్రభుత్వ పాఠశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళు లర్పించారు. ప్రభుత్వ మహిళా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి మాట్లాడుతూ, పలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించడంతో విద్యార్థులకు కొంత అవగాహన వస్తుందన్నారు.

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు రెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు లోనైతే యువత ఏ విధంగా చెడిపోతుందో అనే అంశంపై వివరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, విద్యార్థులు భగత్ సింగ్ ను స్పూర్తిగా తీసుకొని సమస్యలపై విద్యార్థి దశ నుంచే పోరాటాలు చేయాలన్నారు. సెల్ ఫోన్‌లో మంచికంటే చెడునే చూస్తున్నాం న్నారు. ఈ కార్యక్రమంలో కెవీపిఎస్ జిల్లా నాయకులు ఈరెల్లి చిరంజీవి, స్థానిక ఎస్టీ వెల్ఫేర్ వార్డెన్స్ ఈశ్వరరావు, మల్లేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గీతా కృష్ణ , మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు గౌతమ్, ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు రాజు, ప్రసాద్, స్వామి, రవి, భార్గవ్, గణేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక మున్సిపల్ కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో శనివారం కమీషనర్ సురేంద్రకు వినతి పత్రం అందించారు. ఎపి మున్సిపల్ ఎంప్లాయిష్, వర్కర్స్ పెడరేషన్ (సిఐటియు) అద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, మున్సిపాలిటీలో చెత్త సేకరణలో భాగంగా పుష్‌కార్టులు, చీపుర్లు, తట్టలు, గ్లౌజులు వంటి వాటిని కార్మికులకు ఇవ్వాలన్నారు. సుమారు 60 వేలు జనాభా తగినట్లుగా కార్మికుల సంఖ్య పెంచి పని బారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సబ్బులు,నూనెలు ఇవ్వాలని, 2024 జనవరిలో ప్రభుత్వం ఇచ్చిన 1000రూపాయల పోంగల్ అలవెన్సును చెల్లించాలని కోరారు. మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కమీషనర్ స్పందించి సమస్యలు పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. కెవీపిఎస్ జిల్లా ప్రదాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, మున్సిపల్ యూనియన్ నాయుకులు వాసుపల్లి రమణ, చంటీ, తదితరులు పాల్గొన్నారు.

2013 భూసేకరణ చట్టం ప్రకారం

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు ఇప్పటికీ 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ప్యాకేజీ చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, చందనాడ సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్, నిర్వాసితులు డిమాండ్ చేశారు. శనివారం తహసిల్దార్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని చందనాడ రెవెన్యూలో ప్రభుత్వం ఏపీఐఐసి ద్వారా వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు చందనాడ, తమ్మయ్యపేట, తుమ్మలపేట గ్రామాల్లో జిరాయితి, డి.ఫారం, సాగు భూములతో పాటు నివసిస్తున్న ఇల్లులను సేకరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం 2010, సెప్టెంబర్ 15 కటాఫ్ తేదీగా పరిగణనలోకి తీసుకుని నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే ఆర్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని గ్రామ సచివాలయం వద్ద నోటీస్ బోర్డు నందు లబ్ధిదారుల జాబితా ప్రదర్శించడం జరిగిందన్నారు. 2010 సంవత్సరానికి సంబంధించి కటాఫ్ తేదీని తామంతా తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నామన్నారు. నిర్వాసితులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములకు, చెట్లకు, నిర్మాణాలకు, ఇళ్లకు


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించి పునరావాసం, పునర్నిర్మాణం పూర్తి చేసిన పిదప ప్రభుత్వం భూములను ఎప్పుడైతే స్వాధీన చేసుకుంటారో దానినే కటాఫ్ తేదీగా పరిగణనలోకి తీసుకుని అప్పటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఇల్లు కోల్పోయిన వారికి 25 లక్షలు, ప్రాజెక్ట్ ఎఫెక్ట్ కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన వారికి 15 లక్షల ప్యాకేజీ చెల్లించి నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నిర్వాసితులు రోకళ్ళ గోవిందు, పుణ్యమంతుల బాబ్జి, పి.అప్పలరాజు, జీ.సురేష్, వై.శ్రీను, ప్రసాద్, మహేష్ బాబు ఉన్నారు.